అనంతగిరి: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష పడిన సంఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేశ్ తెలిపిన ప్రకారం.. మంగళవారం వికారాబాద్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనం నడుపుతూ పత్లావత్ వినోద్, బాలవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు పట్టు పడ్డారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా ముగ్గురికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ తెలిపారు.

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు.
ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
- మేనేజర్

తెగ తాగిండ్రు!



మద్యం షాపు వద్ద రద్దీ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

మద్యం వ్యాపారం ఉమ్మడి జిల్లాలో కాసులు కురిపిస్తోంది. ఈసారి రికార్డుస్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. ఇటీవల ధరలు పెరిగిన నేపథ్యంలో అమ్మకాలపై ప్రభావం చూపదనుకున్న అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. 2016 డిసెంబర్‌లో రూ. 341 కోట్ల విలువైన మద్యం తాగారు. 2017 డిసెంబర్ మాసంలో రూ.408 కోట్లు తాగేశారు. గతేడాదిని పోల్చుకుని చూస్తే ఈసారి రూ. 67 కోట్లు అధికంగా తాగేయడం జరిగింది. 2016 డిసెంబర్‌లో 5.94 లక్షల కాటన్ల లిక్కర్ అమ్ముడుపోయింది. 2017 డిసెంబర్‌లో 6.99 లక్షల కాటన్ల లిక్కర్ అమ్ముడు పోయింది. అలాగే 2016 డిసెంబర్‌లో 6.60 లక్షల కాటన్ల బీరు అమ్మకాలు జరగగా 2017 డిసెంబర్‌లో 8.45 లక్షల కాటన్ల బీరు అమ్ముడు పోయింది. గత ఏడాదిని పోల్చుకుని చూస్తే ఈసారి 15 శాతం లిక్కర్, 28 శాతం బీర్ కాటన్ల సంఖ్య పెరిగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 412 మద్యం షాపులున్నాయి. అందులో రంగారెడ్డి జిల్లాలో 187, మేడ్చల్ జిల్లాలో 180, వికారాబాద్ జిల్లాలో 45 మద్యం షాపులున్నాయి. అదేవిధంగా 385 బార్లు కొనసాగుతున్నాయి. 2017 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలకుతూ సంబరాలు చేసుకున్నారు. ప్రధానంగా మద్యం రూపంలో నగదు ఐసు ముక్కలై మద్యంలో కరిగి పోయాయి. సాధారణంగా ఒక రోజు రూ. 11 కోట్ల వరకు అమ్ముడిపోయే మద్యం.... డిసెంబర్ 31 ఒక్క రోజునే రూ.50 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. న్యూఇయర్‌కు వారం రోజులు ముందు నుంచే మద్యం అమ్మకాలు ఊపందుకున్నాయి. సంవత్సరమంతా మద్యం ముట్టనివారు కూడా ఈ ఒక్క రోజు తాగడానికి ముందుకొచ్చారు. వచ్చే ఏడాది మద్యం ముట్టబోమని ప్రతిజ్ఞ చేస్తూ డిసెంబర్ 31 రోజున పీకలదాకా తాగారు. ఆ ఒక్కరోజు మద్యం అమ్మకాలు దిమ్మదిరిగేలా ఉంటున్నాయి. ఒక్కో మద్యం దుకాణంలో ప్రతి రోజు లక్షన్నర నుంచి 2 లక్షల అమ్మకాలు జరుగుతాయి. కానీ చివరి రోజు మాత్రం మూడింతలు పెరిగాయి. మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగేందుకు మరో కారణం గ్రామాల్లో బెల్టుషాపులు పెరిగినట్లు తెలుస్తోంది. న్యూఇయర్ సందర్భంగా చివరి రోజున మద్యం దుకాణాలను అర్ధరాత్రి వరకు అనుతించడంతో మద్యంప్రియులు తెగ తాగేశారు.

పాత మద్యం.. కొత్త ధర

ఎక్సైజ్ శాఖ గత డిసెంబర్ 27 నుంచే మద్యం ధరలను పెంచింది. అప్పటికే వైన్‌షాప్‌లలో మద్యం నిల్వలు చేశారు. పాత ధరలకే కొనుగోలు చేసిన మద్యాన్ని నిల్వచేసి కొత్త ధరలకే విక్రయించారు. అయితే మద్యం ధరలు పెంచినప్పటికీ బాటిళ్లపై పాత ఎంఆర్‌పీ ధరలే ఉన్నాయి. దీంతో మద్యంప్రియులు ఆందోళన చెందుతున్నారు. 10 నుంచి 20 శాతం మద్యం ధరలు పెరగటంతో కొత్త సంవత్సరంలో మందుబాబులపై అదనపు భారం పడింది.

పెరిగిన మాంసం విక్రయాలు..

న్యూఇయర్ సందర్భంగా మాంసం విక్రయాలు కూడా పెరిగాయి. మాములు రోజుల్లో మాంసం విక్రయాలు అంతంత మాత్రంగానే ఉంటాయి. డిసెంబర్ 31న రెట్టింపు స్థాయిలో విక్రయాలు జరిగాయి. మటన్ వ్యాపారి ఇతర రోజుల్లో ఒక గొర్రె లేదా మేక మాంసాన్ని మాత్రమే విక్రయిస్తాడు. ఆ రోజు మాత్రం ఐదారు గొర్రెల మాంసాన్ని విక్రయించాడు. రాత్రి 11 గంటల వరకు మాంసం కొనుగోలు జరిగాయి. మటన్ సాధారణంగా రోజుల్లో 10-20 కిలోలు అమ్ముడుపోతుంది. కానీ.. డిసెంబర్ చివరి రోజున మాత్రం 50-60 కేజీల వరకు అమ్ముడుపోయిందని మాసం దుకాణదారులు స్పష్టం చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో దుకాణదారులు ధరలకు కూడా కాస్త పెంచేశారు. కిలో మటన్ రూ.450 నుంచి 490 అమ్ముడు పోయింది. అదనంగా రూ. 40 పెంచేశారు. అలాగే చికెన్ విషయానికి వస్తే.. మామూలు రోజున 20 నుంచి 30 కిలోలు అమ్మేవారు. న్యూ ఇయర్ సందర్భంగా ఒక్క రోజు రూ. 90 నుంచి 100 కిలోలు అమ్ముడు పోయినట్లు చికెన్ నిర్వాహకులు తెలిపారు. కిలో చికెన్ రూ.190 నుంచి రూ. 200 అమ్ముడు పోయింది. మాంసం దుకాణాల్లో పెరిగిన రద్దీ కారణంగా గ్రామాల్లో కొన్ని కుటుంబాలు, సంఘాలు ఉద్యోగులు గ్రూపులుగా ఏర్పడి గొర్రెలను కొనుగోలు చేసి వాటిని కోయించి కుప్పలుగా వేసి పంపకాలు పెట్టారు. నాటు కోళ్ల అమ్మకాలు ఆకాశాన్నంటాయి.

ఒక్క రోజే రూ. 50 కోట్లు తాగేశారు

ఎస్‌వై కురేషి, డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా



డిసెంబర్ మాసం చివరి రోజున ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రూ. 50 కోట్లు తాగేసినట్లు అంచనా. గత ఏడాది కంటే ఈసారి మద్యం అమ్మకాలు పెరిగాయి. వైన్ దుకాణదారులు చాలా వరకు పాత స్టాక్‌నే తీసుకున్నారు. ధరల పెరగటంతో.. కొంత సమస్య నెలకొంది. పాత స్టాక్ అయిపోయాక కొత్త స్టాక్‌ను అందించాలనుకున్నాం. కానీ... సాధ్యపడలేదు.

199 ఎకరాల పరిహారానికి బ్రేక్

- ఫార్మా భూసేకరణలో కొత్త తలనొప్పి
- భూదాన బోర్డు కిరికిరి
- పరిహారం కోర్టులో జమచేయాలని అధికారుల నిర్ణయం!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫార్మాసిటీ భూసేకరణలో రెవెన్యూ అధికారులకు కొత్త తలనొప్పులు మొదలయ్యాయి. యాచారం మండలం మేడిపల్లిలోని 199 ఎకరాల భూదానభూముల పరిహారం విషయంలో భూదానబోర్డు మెలిక పెట్టింది. దీంతో రైతులకు పరిహారం చెల్లింపులో బ్రేక్ పడింది. అయితే ఇది భూసేకరణకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో పరిహారం మొత్తాన్ని కోర్టులో జమ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 20 వేల ఎకరాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న కాలుష్య రహిత ఫార్మాసిటీ కోసం శరవేగంగా భూసేకరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే దాదాపు ఏడు వేల ఎకరాలను అధికారులు సేకరించారు. అయితే మేడిపల్లి గ్రామంలో 199 ఎకరాలు భూదాన భూములు ఉన్నాయి. సుమారు వంద మంది రైతులు వీటిని అనుభవిస్తున్నారు. ఈ భూములనూ ఫార్మాసిటీ కోసం సేకరించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ భూములను కొందరు మాత్రమే సాగు చేస్తున్నారు. మిగిలిన వారు ఖాళీగానే ఉంచారు. వీరంతా తమకూ పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. అసైన్‌దారులకు పరిహారం చెల్లిస్తున్నందున తమకూ పరిహారం ఇవ్వాలని వారంతా కోరుతున్నారు. దీనిపై నిర్ణయం తీసుకోవాలని గతంలో అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. అయితే దీనిపై ప్రభుత్వం స్పందించి మీరే తుది నిర్ణయం తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగానికి సూచించింది. అయితే ఈ భూములను రైతులకు దానం చేసినట్లుగా రికార్డులు సరిగా లేవు.

దీనిపై రెవెన్యూ అధికా రులు భూదాన బోర్డును సంప్రదించారు. అసైన్ఢ్ భూములు అనుభవిస్తున్న రైతు లకు పరిహారం ఇచ్చినట్లే భూదానభూము లకూ పరిహారం చెల్లించాలని భావిస్తున్నట్లు తెలిపారు. రైతులకు పరిహారం ఇస్తే తమకు అభ్యంతరం లేదని మాటల్లో చెప్పారు. దీనికి రాత పూర్వకంగా ఆమోదం తెలుపుతూ లేఖ ఇవ్వాలని రెవెన్యూ అధికారులు కోరగా ఇందుకు సరే అన్నారు. అయితే లేఖలో మాత్రం ఈ భూమిపై తమకు ఆసక్తి ఉందని తెలిపారు. అంటే పరిహారం తమకే చెల్లించాలనే విధంగా లేఖ రాశారు. అయితే ఈ భూములపై హక్కులు ఉన్నట్లు పత్రాలు తీసుకురావాలని రెవెన్యూ అధికారులు కోరగా దీనిపై మాత్రం స్పందించ లేదు. అయితే రైతులు మాత్రం తమకే పరిహారం దక్కాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. భూదాన బోర్డుకు, రైతుల మధ్య వివాదం నెలకొనడంతో పరిహారం మొత్తాన్ని కోర్టులో జమచేసి వీటిని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. కోర్టులో ఎవరికి అనుకూలంగా తీర్పు వస్తే వారు పరిహారం పొందేందుకు ఆస్కారం ఉంటుంది.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

చేవెళ్ల / షాబాద్ : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల, మార్కెట్‌యార్డు, సర్దార్‌నగర్ మార్కెట్‌యార్డుల్లో ఎంపీపీలు బాల్‌రాజ్, జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్లు దేవుని విజయలక్ష్మీశర్వలింగం, శేరిగూడెం వెంకటయ్యతో కలిసి నాఫెడ్ వారి ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కందులకు ప్రభుత్వం మద్దతు ధర రూ. 5250 ఉండగా బోనస్‌గా రూ.200 చెల్లిస్తూ మొత్తం రూ 5450 గా ప్రతి క్వింటాలుకు మద్దతుధరగా నిర్ణయించిందన్నారు. ప్రతి మండలంలో 25 వేల మెట్రిక్ టన్నుల గోదాములను నిర్మించినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలను చేవెళ్ల, సర్ధార్‌నగర్, షాద్‌నగర్, ఆమన్‌గల్‌లలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వఉంచే విధంగా ప్రతి మండంలో గోదాములు నిర్మించడం జరిగిందన్నారు. రైతులందరు కందులను ఇక్కడే అమ్ముకోవాలన్నారు. రైతులు ధాన్యం తీసుకొచ్చేముందు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, వీఆర్వో సంతకం, ఫోన్ నెంబర్ తీసుకురవాలని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కందులు కోనుగోలుచేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ మాసన్నగారి మాణిక్యరెడ్డి, డీసీఎం జిల్లా అధికారులు శివారెడ్డి, పాండురంగం, చేవెళ్ల గోదాం ఇన్‌చార్జి శివారెడ్డి, సర్పంచ్ నర్సింహులు, సీనియర్ నాయకులు దేవుని శర్వలింగం, జడ్పీటీసీ లక్ష్మీరాజేందర్‌గౌడ్, ఎంపీటీసీ మౌనిక, ఎంపీడీవో పద్మావతి, మార్కెటింగ్ శాఖ అధికారులు, వాజీత్, చంద్రయ్య, వెంకటమ్మ, చారి, అధ్యక్షులు మంజుల, నాగమణి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో కందుల కొనుగోలు కేంద్రంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అన్ని సముదాయాలు ఒకే చోట

కుల,మత సంక్షేమ భవనాల నిర్మాణాలపై సర్కార్ యోచన

కోకాపేటలోనే భూకేటాయింపులు

ప్రజల మధ్య సామరస్యత పెంపు కోసం నిర్ణయం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలోని అన్ని కులాలు, మతాలకు సంబంధించిన సంక్షేమ భవనాలను ఒకేచోట నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు సంబంధించి పలు సంస్థల నుంచి భూకేటాయింపుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తోంది. గండిపేట మంలడం కోకాపేటలో ఈ సంస్థలకు భూములు కేటాయించేందుకు దాదాపు నిర్ణయం తీసుకుంది. ఇటీవల ప్రభుత్వం కోకాపేటలోని సర్వేనంబరు 239, 240లో కురుమ, యాదవ సంక్షేమ భవన్‌కు పదెకరాల భూమి కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ భవన నిర్మాణానికి వారం రోజుల కిందట సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఇక్కడ ఇంకా ఖాళీ ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండడంతో మిగతా మత, కుల సంస్థలకూ ఇక్కడే భూమి కేటాయించి భవన సముదాయాలను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. వాస్తవానికి కురుమ, యాదవ సంక్షేమ భవనానికి రాజేంద్రనగర్ బుద్వేల్‌లో స్థలం కేటాయించాలని కురుమ, యాదవ ప్రతినిధులు సీఎంను కోరారు. ఇందుకు ప్రభుత్వం ముందు సానుకూలత తెలిపింది. అయితే తరువాత కోకాపేటలో పదెకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఇస్లామిక్ స్టడీ సెంటర్‌కు ఇక్కడే మరో పదెకరాల స్థలాన్ని కేటాయించాలని దాదాపు నిర్ణయించింది. అలాగే బసవేశ్వర సంక్షేమభవన్‌కు మూడెకరాల స్థలం కావాలని వీర శైవలింగాయత్‌లు కోరుతున్నారు. వీరు శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో స్థలం కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇపుడు కోకాపేటలో స్థలం కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇక కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న క్రైస్తవ భవన్ నిర్మాణ పనులు కోకాపేటలోనే చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ముదిరాజ్ కమ్యూనిటీ భవన్ నిర్మాణానికి మహేశ్వరం మండలం రావిర్యాలలో అయిదెకరాల స్థలం కావాలని ముదిరాజ్ ప్రతినిధులు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికీ కోకాపేటలోనే స్థలం కేటాయించాలని నిర్ణయించారు,

ఔటర్‌కు సమీపంలో...

ఔటర్ రింగురోడ్డుకు అతి సమీపంలోనే కోకాపేట భూములు ఉండడంతో కుల, మత సంక్షేమ భవన్‌లకు ఇక్కడ భూములు కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాం తాల నుంచి వచ్చేవారికి రోడ్డు రవాణాసౌకర్యం ఉంటుందనే ఉద్దేశం తో సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గండిపేట మండలం కోకాపేటలోని సర్వేనంబరు 239,240లలో మొత్తం 534 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. కోకాపేట జంక్షన్, ఔటర్ రింగురోడ్డుకు కేవలం అరకలో మీటర్ దూరంలోనే ఈ భూములు ఉన్నాయి. వీటిని ప్రభుత్వం 2000 సంవత్సరంలో హెచ్‌ఎండీఏ (అప్పట్లో హుడా)కు కేటాయించింది. హెచ్‌ఎండీఏ ఆధీనంలో ఉన్న ఈ భూములను ఇప్పటికే కొన్ని సంస్థలకు కేటాయించింది. ఇక్కడ మొత్తం 534 ఎకరాల ఎకరాలు ఉండగా సర్వేనంబరు 239లో 218 ఎకరాలు, సర్వేనంబరు 240లో 316 ఎకరాల భూమి ఉంది. వీటిలో ఎస్‌ఈజెడ్, మూవీ టవర్స్, ఇతర సంస్థలకు భూములు కేటాయించగా ఇంకా హెచ్‌ఎండీఏ వద్ద 202 ఎకరాల భూమి మిగిలి ఉంది. మిగిలిన భూములను కుల, మత సంక్షేమ భవన్‌ల నిర్మాణానికి కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. అన్ని కులాలు, మతాల సంక్షేమ భవన్‌లు ఒకే ప్రాంతంలో ఉంటే ప్రజల మధ్య సామరస్యత పెరుగుతుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

మేడ్చల్



మంత్రి తలసానిని కలిసిన ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు

ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఆల్ ఇండియా ఫిషరీస్ డైరెక్టర్ చినంగని వెంకటేష్ ముదిరాజ్ మంగళవారం మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేతో అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు చిదంబర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. **- మేడ్చల్ రూరల్**

జోరుగా కృత్రిమ ఇసుక దందా

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- తూతూ మంత్రంగా దాడులు
- కేసులు నమోదు చేయని అధికారులు

శామీర్‌పేట రూరల్ : ఇసుక అక్రమ తయారీదారులు రాత్రి, పగలు తేడా లేకుండా కృత్రిమ ఇసుకను తయారు చేస్తూ అక్రమంగా రవాణ చేస్తున్నారు. శామీర్‌పేట మండలంలోని కేశవరం గ్రామంలో మట్టిని తీసుకొచ్చి ట్రాక్టర్‌లో నింపి జనరేటర్ సహాయంతో ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృత్రిమ ఇసుకను తయారు చేయకూడదని నియమ, నిబంధనలు ఉన్నా తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో తయారీదారులు రెచ్చిపోయి కృత్రిమ ఇసుకను తయారుచేస్తూ డబ్బులు దండుకుంటున్నారు. కృత్రిమ ఇసుక తయారుచేసినవారిపై గతంలో రెవెన్యూ అధికారులు పలు కేసులు నమోదు చేసినా ఇసుకాసురులు అవేమి పట్టించుకోకుండా మళ్లీ ఇసుకదందా చేస్తున్నారు. దగ్గరలోని మట్టి కుప్పలను ఒకచోటపోసి దానిని ట్రాక్టర్‌లో నింపి నీటితో ఇసుకను తయారుచేసి పట్టణంలో అమ్ముతున్నారు. ఈ తంతు మండలానికి కూతవేటు దూరంలో జరుగుతున్నా సంబంధిత అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. ఫిల్టర్ ఇసుకను వాడుతూ ఇళ్లు కట్టుకున్నవాళ్లు పూర్తిగా నష్టపోతున్నారు. కృత్రిమ ఇసుకను వాడకుండా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, అధికారులు తూతూమంత్రంగా దాడులుచేసి వదిలిపెట్టడంతో ఇసుకాసురులు తిరిగి ఇసుకను తయారుచేస్తున్నారు. కృత్రిమ ఇసుక తయారీదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశాలున్నా అధికారులు అలసత్వం వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. మండలంలోని ఆద్రాస్‌పల్లి అనుబంధ గ్రామమైన ఎల్లగూడెంలోనూ రాత్రిపూట కృత్రిమ ఇసుకను తయారుచేస్తున్నారని సమాచారం. టిప్పర్‌ల కొద్ది ఇసుకను రాత్రికి, రాత్రే తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగమంతా మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్నా అధికారులకు సమాచారం లేకపోవడం విశేషం. ఇప్పటికైన అధికారులు స్పందించి కృత్రిమ ఇసుక తయారుచేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న దృశ్యం



కుప్పలుగా పోసిన కృత్రిమ ఇసుక

మునిగి తేలారు

- న్యూ ఇయర్‌కు రెట్టింపైన మద్యం అమ్మకాలు
- ధర పెరిగినా లెక్కచేయని మద్యం ప్రియులు

మేడ్చల్ : పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ మద్యం ప్రియులు మత్తులో మునిగితేలారు. మూడేళ్లుగా డిసెంబర్ 30, 31 తేదీల్లో మద్యం విక్రయాలను పరిశీలిస్తే ఈ ఏడాది రికార్డు స్థాయిలో విక్రయాలు పెరిగాయి. న్యూ ఇయర్‌కు నాలుగు రోజుల క్రితం మద్యం ధరలు పెరిగినా మందుబాబులు లెక్క చేయలేదు. మేడ్చల్ ఎక్సైజ్ డివిజన్ పరిధిలో మేడ్చల్, శామీర్‌పేట మండలాల్లో కలిపి 25 మద్యం దుకాణాలున్నాయి. డిసెంబర్ నెలాఖరులో రెండు మండలాల్లో 3 కోట్ల 31 లక్షల 72 వేల 799 రూపాయల విలువ చేసే మద్యం విక్రయించినట్లు అబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో కంటే రెట్టింపు విక్రయాలు జరిగాయి. ఈ ఏడాదిలో రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. నాలుగు రోజుల క్రితం పెరిగిన ధరలను లెక్క చేయకుండా కొత్త సంవత్సర వినోదాలే ముఖ్యంగా మద్యం ప్రియులు మద్యాన్ని కొనుగోలు చేశారు. న్యూఇయర్ సందర్భంగా 5,207 కేసుల లిక్కర్, 5096 కేసుల బీర్ల విక్రయాలు జరిగాయి.

ఎంపీటీసీ భర్తను పరామర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



మెదడుకు సం బంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరంగవరం ఎంపీటీసీ భర్త వీరేష్‌ను మంగళవారం జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జడ్పీటీసీ శైలజ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అందజేసిన పది వేల ఆర్థిక సహాయాన్ని వారు ఎంపీటీసీకి అందజేశారు. **- మేడ్చల్ రూరల్**

కూకట్‌పల్లి రైతుబజార్ ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : జేఎన్‌టీయూ రోడ్డులోని కూకట్‌పల్లి రైతుబజార్ ధరలు ఇలా ఉన్నాయి. కిలో.. టమాట రూ.13, వంకాయ రూ.19, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.31, బజ్జి మిర్చి రూ. 28, కాకర రూ.31, బీర రూ.31, క్యాబెజ్ రూ.14, ఫ్రెంచి బీన్స్ రూ.28, క్యారెట్ రూ.50, దొండ రూ. 30, చిక్కుడు రూ.38, గోరుచిక్కుడు రూ.38, బీట్‌రూట్ రూ.20, బంగాళ దుంపలు రూ.14 పైన పేర్కొన్న ధరలు ఈ రోజు ఉదయం 9.30 గంటల వరకు అమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

శామీర్‌పేట : 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని టీఆర్‌ఎస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, కేసీఆర్ సేవా దళం రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి ఎండీ అఫ్జల్‌ఖాన్ అన్నారు. ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించిన సందర్భంగా మంగళరం శామీర్‌పేటలో అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరాను ప్రారంభించినందుకు ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు, రైతులు సత్తయ్య, వెంకటయ్య, నాగరాజు, వెంకటేశ్, సతీష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

జగ్గన్‌గూడ గ్రామంలో...

శామీర్‌పేట రూరల్ : నిరంతర విద్యుత్ అందించడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని యూత్ మండల అధ్యక్షుడు అనిల్‌రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం జగ్గన్‌గూడ గ్రామంలో ప్రధాన చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ అందించడం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్‌కు రైతులు రుణపడి ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగరాజుగుప్త, మాజీ ఎంపీటీసీ వీరస్వామి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, టీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సుధాకర్, జహంగీర్, రైతులు బాల్‌రెడ్డి, కిష్టారెడ్డి, నర్సింహులు, సత్యనారాయణ, రమేష్, శివ పాల్గొన్నారు.



శామీర్‌పేటలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అఫ్జల్‌ఖాన్, టీఆర్‌ఎస్ నాయకులు, రైతులు



జగ్గన్‌గూడలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అనిల్‌రెడ్డి, తదితరులు

కలెక్టర్ ఎంవీ రెడ్డికి శుభాకాంక్షలు

శామీర్‌పేట రూరల్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శామీర్‌పేట మండలం మూడుచింతలపల్లి గ్రామ సర్పంచ్ పద్మాలక్ష్మారెడ్డి మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డిని కలెక్టర్ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రామసభలో పాల్గొన్న సీఎం చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు.



కలెక్టర్‌కు చిత్రపటం బహూకరిస్తున్న సర్పంచ్ పద్మాలక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి పూలబోకేను అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న సర్పంచ్ శ్యామల, చిత్తయ్య తదితరులు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

శామీర్‌పేట రూరల్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శామీర్‌పేట మండలం లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ కటికెల శ్యామల, టీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎల్లగౌని చిత్తయ్య ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, మాజీ సర్పంచ్ సింగం సత్తయ్య, నాయకులు మధుకర్‌రెడ్డి, నర్సింగరావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన టీఆర్‌ఎస్ నేతలు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన టీఆర్‌ఎస్ నేతలు

మేడ్చల్ రూరల్ : టీఆర్‌ఎస్ మేడ్చల్ పట్టణ నేతలు మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. న్యూ ఇయర్ సందర్భంగా పూలబొకేతో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్య క్రమంలో టీఆర్‌ఎస్ పట్టణ నేతలు మల్లికార్జునస్వామి, విష్ణుచారి, శేఖర్‌గౌడ్, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, సంజీవరావు, నడికొప్పు నాగరాజు, ప్రతాప్, రవీందర్, శ్రీనివాస్, రాజు, విజయ్, బండమీది రవిముదిరాజ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సాగుకు 24గంటల విద్యుత్

- జిల్లాలోనూ విజయవంతం
- రైతుల కష్టాలు తీరినట్టే
- 12గంటల సరఫరా మేలంటున్న పలు ప్రాంతాల రైతులు

(ఆంధ్రజ్యోతి, మేడ్చల్‌జిల్లా ప్రతినిధి): తెలంగాణాలో రైతులకు 24గంటల పాటు ఉచితంగా విద్యుత్ అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. 2018 జనవరి ఒకటోతేదీ నుంచి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాకు సన్నాహాలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. మేడ్చల్‌మల్కాజ్‌గిరిజిల్లాలోనూ ప్రారంభం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులేమీ లేవు. జిల్లాలో వ్యవసాయ బోర్లపైనే ఆధారపడి రైతుల పలు పంటలను సాగు చేస్తారు. ప్రధానంగా వరి, కూరగాయలు, ఉద్యానవన పంటలను పండిస్తారు. అయితే భూగర్భజలాలు పుష్కలంగా ఉన్న పక్షంలో రైతులందరికీ నిరంతరం విద్యుత్ తప్పనిసరిగా అవసరం ఉంటుంది. జిల్లాలో 14రెవెన్యూ మండలాలు ఉన్నాయి. 77 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో 6మండలాల్లోని పలు గ్రామాల్లోని రైతులు మాత్రమే వ్యవసాయ పనులు చేపడుతున్నారు. జిల్లాలోని మేడ్చల్, శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్ గ్రామీణమండలాలు కాగా,దుండిగల్ గండిమైసమ్మ, కుత్బుల్లాపూర్ సెబీఅర్బన్ మండలాలు. మిగతా 8మండలాలు పూర్తిగా పట్టణ ప్రాంతంలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న. జొన్న, కందులు, పెసర్లు, కూరగాయల పంటలు సాగుచేస్తుండగా, శివారు మండలాల్లో పలు రకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 16వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా తక్కువగా విద్యుత్ కనెక్షన్లు మేడ్చల్ జిల్లాలోనే ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సామర్థ్యం గల వైర్లను, స్విచ్ ఆన్ ఆఫ్ బటన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో కొత్తగా 16సబ్‌స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేసి,లో ఓల్టేజీ సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా జిల్లాకు కావాల్సిన అదనపు ట్రాన్స్‌పార్మర్ల మంజూరు కోసం సంబంధిత అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్‌సీజన్‌లో దాదాపు 10వేల హెక్టార్లలో, రబీ సీజన్‌లో 5వేల హెక్టార్లలో పలు రకాల పంటలను సాగు చేస్తారు. 50శాతం వరి పంటపైనే ఆసక్తి చూపుతున్నారు. మరో 4వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నారు. జిల్లాలో 1.60లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, జిల్లాలో మొత్తం 37,821ఎకరాల వ్యవసాయ భూమి పంటల సాగుకు అనుకూలంగా ఉంది. సమగ్ర రైతు సర్వే ప్రకారం జిల్లాలో వ్యవసాయ భూముల ఉన్న రైతు కుటుంబాలు 15,860మంది ఉన్నారు. సాగుకు ఉపయోగకరంగా 19,546 ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉంది. రైతులకు ఉచితంగా 24గంటల పాటు విద్యుత్ విద్యుత్ సరఫరా చేస్తుండటంతో వ్యవసాయ బోరుల్లో నీరు పుష్కలంగా ఉన్న రైతులు రెండు పంటలు వేసుకునేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నారు. అయితే భూగర్భజలాలు అంతగా లేని రైతులు మాత్రం ఉదయం వేళల్లో 12గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేస్తే సరిపోతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసి, చెరువులన్నీ నిండుకుండల్లా ఉన్నట్లయితే బోరుబావుల్లోకి పుష్కలంగా నీరు వచ్చే చేరుతుంది. వర్షాలు రాని పక్షంలో బోర్లల్లో నీరు తగ్గుముఖం పడుతుంటాయి. నిరంతరం బోర్లు నడపడంతో భూగర్భ జలాలు అడుగంటి పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో ఆటోమెటిక్ స్టార్టర్లు (ప్రివెంటర్) తొలగించకపోతేనే మంచిదని రైతులు కోరుతున్నారు. ఆటోమెటిక్ స్టార్టర్లను తీసివేసిన పక్షంలో బోరు మోటార్లు, విద్యుత్ ట్రాన్సుపార్మర్లు కాలిపోయి రైతులు నష్టపోయే ప్రమాదముందని రైతులు తెలిపారు. జిల్లాలో భూగర్భజలాలు పుష్కలంగా ఉంటేనే 24గంటల విద్యుత్ వినియోగం సాధ్యమవుతోంది.



రైతుల కష్టాలు తీరినట్టే



గతంలో వ్యవసాయానికి షరతులతో కూడిన కరెంటును సరఫరా చేయడంతో ఇబ్బందులు పడ్డాం. వ్యవసాయ రంగానికి 24గంటల కరెంటు ఇవ్వడంతో రైతుల కష్టాలు తీరినట్టే. ఈ ఏడాది భూగర్భ జలాల మట్టం పెరుగడంతో వ్యవసాయం పెరుగనుంది.

-ఆంజనేయులు, గిర్మాపూర్, రైతు

భూగర్బ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది



వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వలన భూగర్భ జలాలు తగ్గిపోయె ప్రమాదం ఉంది. రెండు మూడు నెలలు ఇబ్బంది లేనప్పటికీ ఎండకాలంలో తీవ్ర నీటి సమస్య తలెత్తుతుంది. ఆటోస్టార్టలను తీసేయడం వల్ల రైతులు బోర్ల వద్దే కాపాల ఉండాల్సి వస్తుంది. ఆటోస్టార్టలకు అనుమతి ఇవ్వాలి.

-చందుపట్ల నర్సింహరెడ్డి, చందుపట్లగూడ

బోర్లు కాలిపోయే ప్రమాదం ఉంది



వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరాతో తక్కువ నీరుపోసే బోర్లు కాలిపోయే ప్రమాదం ఉంది. దీంతో పుష్కలంగా నీరున్న రైతులకు ప్రయోజనం ఉన్నప్పటికి ఆరకొర నీటిసౌకర్యం ఉన్న రైతులు బోర్లు ఎండిపోయి కాలిపోయే ప్రమాదం ఉంది. వ్యవసాయ రంగానికి 12గంటల పగటిపూట కరెంట్ సరఫరా చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

-రూప్‌సింగ్ నాయక్ ఫక్కీర్‌టెక్యా, కౌలు రైతు

టీఎఎస్‌యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి

కీసర రూరల్: పాఠశాల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా టీఎఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని, క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధిక సంఖ్యంలో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి, బడుగు బలహీన వర్గాల విద్యార్థులందరికి నాన్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. 'వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్' పత్రిక ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలన్నారు. విద్యారంగాభివృద్ధే ప్రధాన ఎజెండాగా మారాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, రమేష్‌కుమార్, ఉపాధ్యక్షులు మల్లేష్, కోశాధికారి డాక్టర్. జగన్నాథ్, జిల్లా కార్యదర్శులు ఉపేందర్, వందన, మూర్తి పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి: కలెక్టర్

కీసర రూరల్: ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంవీ.రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారిగా ప్రజలకు సేవలందించడం ఓ పుణ్యకార్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను అగ్రగామిగా నిలుపుదామని పిలుపునిచ్చారు. జానాభా పరంగా జిల్లా రెండో స్థానంలో ఉందన్నారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నామన్నారు. సంవత్సరకాలంలో జిల్లాకు దశ-దిశను నిర్ధేశించగలిగామని సంతృప్తి వ్యక్తం చేశారు. పలు ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా ముందుదన్నారు. లక్ష్య సాధనలో జిల్లా అధికారులు సమిష్టిగా విధులు నిర్వహించారని అభినందించారు. రాష్ట్ర అవతరణ, జిల్లా ఆవిర్భావ, గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నామని అన్నారు. అభివృద్ధి ప్రక్రియలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, మీడియా సమన్వయంతో పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. 2019 వేడుకలు నూతన కలెక్టరేట్‌లో జరుపుకుందామన్నారు. ఈ సామవేశంలో జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు సురేష్‌మోహన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చేతిలో దొంగల జాతకాలు

- పోలీస్ శాఖకు కొత్త యాప్
- వేలిముద్రతో క్షణాల్లో జాతకాలు
- తగ్గనున్న నేరాల సంఖ్య

HYD COPS
PROPERTY OFFENDERS
MOBILE APP

మేడ్చల్: ఇక పోలీసులు కష్టపడి ఫింగర్ ప్రింట్‌లు సేకరించాల్సిన అవసరం లేదు. క్షణాల్లో దొంగల జాతకం గుట్టువిప్పే యాప్‌తో పోలీసుల పని మరింత సులభతరం కానుంది. ఒకే ఒక ఫింగర్ ప్రింట్‌తో నేరస్తుల పూర్తి వివరాలు పోలీసుల చేతిలోకి వస్తాయి. నేరస్తుడిపై ఎన్ని కేసులు ఉన్నాయి. ఏ స్థాయి నేరస్తుడు. తదితర వివరాలను గుర్తించేందుకు పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోబోతున్నారు. రాత్రివేళ తనిఖీల్లో రోడ్లపై అనుమానితులు ఎవరున్నా వారి నేరాల వివరాలను ఇట్టే తెలుసుకునేలా పోలీసులు ఫింగర్ ప్రింట్ అప్లికేషన్(టీఎస్ కాప్స్ ఆప్)ను అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో నిందితుల నుండి నిజాలు రాబట్టాలంటే పోలీసులు తమదైన శైలిలో విచారించడం, వేలి ముద్రలు సేకరించి ల్యాబ్‌లకు పంపించడం, నివేదిక రావడానికి రోజుల సమయం పట్టడం ఇలా జాప్యం జరిగేది. కానీ ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ నేరాల చేయడంలో ఆరితేరిన నిందితుల గుట్టును రట్టు చేస్తున్నారు. సులభతరమైన పద్దతిలో నేరస్తులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. వేషాలు మార్చుకుని నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు ఈ అప్లికేషన్ బాగా ఉపయోగపడుతుందని పోలీసులు తెలుపుతున్నారు. నేరస్తుల పట్టివేతకు ఫింగర్ ప్రింట్ అప్లికేషన్ పోలీస్‌శాఖకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పట్టుబడ్డ వారి వివరాలను సేకరించే పోలీసులు వారి మొత్తం వివరాలను ఫింగర్ ప్రింట్‌తో సహా ఈ అప్లికేషన్‌లో పొందుపరుస్తారు. ఆ తర్వాత వారు ఎక్కడైనా అనుమానస్పదంగా కనిపించినా అదుపులోకి తీసకుని వేలి ముద్ర వేయిస్తే చాలు వారి జాతకం మొత్తం బయటపడుతుంది. వారు ఎక్కడి వారు ఇప్పటి వరకు ఎన్ని నేరాలు చేశారు వంటి వివరాలన్నీ యాప్ ద్వారా క్షణాల్లో ప్రత్యక్షమౌతాయి. ఒకవేళ నేరస్తులు కాని వారిని పోలీసులు అనుమానస్పదంగా భావించి ఫింగర్ ప్రింట్ తీసుకున్నప్పుడు నేరస్తుడు కాదని నాట్ మ్యాచ్ అనే జవాబుని ఈ అప్లికేషన్ క్షణాల్లో ఇచ్చేస్తుంది. అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేటప్పుడు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని పోలీసు అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఫింగర్ ప్రింట్ అప్లికేషన్ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని రాత్రి వేళ పెట్రోలింగ్ సందర్భంగా వినియోగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ యాప్‌లోకి కేవలం పోలీసు శాఖ మాత్రమే యాక్సిస్ ఉంటుంది. నిందితులా కాదా అన్నది క్షణాల్లో వచ్చే అవకాశం ఉండటంతో పెట్రోలింగ్‌కు వాడుకోవచ్చు. రాత్రి వేళల్లో కూడా నేరాలు అదుపులోకి వచ్చే అవకాశం ఉంటుంది. యాప్ ఉపయోగించే విధానంపై ఇప్పటికే పోలీసులలకు శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిసింది. ఈ యాప్‌ను వినియోగించేందుకు ప్రత్యేక ట్యాబ్‌లు కూడా స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు చేరినట్లు సమాచారం.

సులభతరం అవుతుంది



ఫింగర్ ప్రింట్ యాప్ ద్వారా తనిఖీల సమయాల్లో నేరాల వివరాలు తెలుసుకునేందుకు సులభతరమౌతుంది. గతంలో మాదిరిగా నివేదికలు వచ్చేంత వరకు వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా రాత్రి వేళల్లో తనిఖీల సమయాల్లో రోడ్లపైనే నేరస్తులో కాదో ఇట్టే తెలిసిపోతుంది. అప్పటికప్పుడు నేరస్తుల పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశముంది. దీనిని సద్వినియోగం చేసుకుని నేరాల తగ్గేందుకు కృషి చేస్తాం.

-సీఐ వెంకట్‌రెడ్డి

'పరిమితికి మించి రవాణా చేస్తే కఠిన చర్యలు'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కీసర రూరల్: పరిమితికి మించి రవాణా చేసినట్టయితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు మేడ్చల్-మల్కాజ్‌గిరి రవాణా శాఖ జిల్లా అధికారి డాక్టర్. పుష్పాల శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'లారీలతో వేగేదెలా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి డీటీఓ స్పందించారు. ఇసుక, గ్రానైట్, ఇటుకలు, కాంక్రీట్‌ను పరిమితకి మించి రవాణా చేస్తున్నారని, రోడ్డు ప్రమాదకరంగా తయారవుతున్నయన్నారు. దీంతో ఇతర ప్రయాణీకులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అధికలోడ్‌తో రవాణా చేస్తున్న లారీల యజమానులకు, సమీప క్రషర్ల యజమానులకు తగు సూచనలు చేశామని తెలిపారు. రవాణా చేస్తున్న సరుకులు రోడ్డుపై పడకుండా వాహనాలపై టార్పలిన్లు కప్పి ఉంచాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. లారీల యజమానులపై, డ్రైవర్లపై కేసులు నమోదు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తనిఖీలు నిర్వహించి పరిమితికి మించి సరుకులు రవాణ చేస్తున్న వారిని అరెస్టు చేస్తామని హెచ్చరించారు.



సాగునీటి కోసం నిరసన

- సాగునీటి కార్యాలయం ఎదుట రైతుల వంటావార్పు.
- అక్కంపల్లి గ్రామ రైతుల పొలాలకు జుంటుపల్లి నీరందించాలని ధర్నా
- పురుగుల మందు డబ్బాలతో మహిళ రైతుల నిరసన

తాండూరు : యాలాల మండలం జుంటుపల్లి ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నప్పటికీ అక్కంపల్లి రైతుల పొలాలకు నీరందించకుండా నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంగళవారం భాదిత రైతులు తమ కుటుంబ సభ్యులతో సహా సాగునీటి తాండూరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అక్కడే వంటావార్పు చేసుకుని నిరసన తెలిపారు. జుంటుపల్లి ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే అక్కంపల్లి రైతులకు నీరందించాలని కొన్ని నెలలుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని, కాల్వలు పూడ్చుకుపోయాయని, దీంతో పచ్చగా ఉండే పంట పొలాలు బీడు భూములుగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నీటిని కొంత మంది పైపుల ద్వారా అక్రమంగా నీటిని వాడుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పొలాలకు నీరందించకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ రైతు కుటుంబాలు ఆందోళన చేశారు. కార్యాలయం ముందు క్రిమిసంహారక మందు డబ్బాలు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ ధర్నాకు బీజేపీ సంఘీభావం తెలిపింది. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్, నియోజకవర్గ కన్వీనర్ పూజారి పాండు, పట్టణాధ్యక్షుడు బంట్వారం భద్రేశ్వర్ తదితరులు సంఘీభావం తెలిపారు. అక్కంపల్లి రైతులకు సాగునీరందించకపోవడంపై ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. పూడుకుపోయిన కాల్వల్లో మట్టి తీయించి నీరందిస్తామని ఇరిగేషన్ అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఒక రైతు అర ఎకరా నుంచి ఎకరా భూమి ఉన్నందున అట్టి భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నందున వారందరికీ సాగునీరందించాలని జిల్లా బీజేపీ కార్యదర్శి యు.రమేష్ డిమాండ్ చేశారు.

ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్న 3,259 మంది విద్యార్థులు
- జిల్లా ఇంటర్ బోర్డు నోడల్ అధికారిణి అనుసూజ



తాండూరు : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలను జిల్లాలో 3,259 మంది విద్యార్థులు రాయనున్నారని జిల్లా ఇంటర్ బోర్డు నోడల్ అధికారిణి అనుసూజ చెప్పారు. మంగళవారం పరీక్షా కేంద్రాల కోసం వివిధ కళాశాలలను తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నందున జిల్లా వ్యాప్తంగా 24 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రాల ఏర్పాటుకు ల్యాబ్ సౌకర్యాలు, ఫర్నిచర్, గదులు అనుకూలంగా ఉన్నాయా అనే వాటిపై పరిశీలించి ఇంటర్ బోర్డుకు నివేదిస్తామని చెప్పారు. ఈనెల 27న ఎథిక్స్ హ్యూమన్ వ్యాల్యూ, 29న ఎన్విరాన్‌మెంట్, ఫిబ్రవరి 1నుంచి 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని చెప్పారు.

జిల్లా కలెక్టర్‌గా సయ్యద్ ఒమల్ జలీల్

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్)

వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా సయ్యద్ ఒమల్ జలీల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న సయ్యద్ ఒమల్ జలీల్‌ను జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. 1998 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఒమల్ జలీల్ వరంగల్ సబ్ కలెక్టర్‌గా, జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన దివ్య దేవరాజన్‌ను గత ఏడాది డిసెంబర్ 16న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్‌గా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎం.రఘునందన్‌రావు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్‌గా నియామకమైన సయ్యద్ ఒమల్ జలీల్ రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

విస్తరణేదీ!



- తాండూరు మున్సిపాలిటీ విస్తరణపై మళ్లీ నీలినీడలు
- పెండింగ్‌లోనే దస్త్రం
- ఊరించి...ఉత్తిదేనా...?
- శివారు కాలనీ వాసులకు ఇబ్బందులు ఇంకా తప్పవా..
- కేటీఆర్ హామీ ప్రకటనకే పరిమితమా?
- వ్యతిరేకిస్తున్న శివారు గ్రామాలు
- పట్టణంలోకి విలీనం కాని భూములు
- ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ
- అవస్తలు పడుతున్న జనం
- మంత్రి చొరవ చూపాలని బల్దియా ప్రజా ప్రతినిధుల డిమాండ్

"పట్టణ శివారులోని పల్లెలకు పట్టణీకరణ పనులు చేపట్టాలని, పట్టణాలకు మూడు నుంచి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉండే శివారు గ్రామాలు కాలనీలను పట్టణాల్లో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలి"...ఇవి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలు.

తాండూరు : మంత్రి కేటీఆర్ ఆదేశాలు అందుకున్న పురపాలక శాఖ ఉన్నతాధికారులు వారం రోజులపాటు అప్పట్లో ప్రతిపాదనలకై హల్‌చల్ చేశారు. పెండింగ్ ఫైల్‌కు మార్గం సుగమం అయిందని, ఆదాయం పెంచుకోవచ్చని అధికారులు ఆశ పడ్డారు. శివారు కాలనీల ప్రజలు సంబర పడిపోయారు. తీరా నెల రోజులు గడిచిపోయినా నేటి వరకు పట్టణ శివారు కాలనీల విలీనం,విస్తరణ, గ్రామాల విలీనంపై ఎలాంటి చర్యలు ప్రారంభం కాలేదు. దీంతో మళ్లీ తాండూరు పట్టణ విస్తరణ పెండింగ్‌లో పడినట్లే. ఎంతో ఆశతో ఎదురు చూసిన పాలకులకు, ప్రజలకు, శివారు కాలనీ వాసులకు నిరాశే కనిపిస్తోంది. తాండూరు పట్టణ శివారు కాలనీల్లో గత రెండు దశాబ్దాల కాలంగా ప్రజలతోపాటు పాలకులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీలో విలీనం చేయాలంటే ఆయా గ్రామపంచాయతీలను విలీనం చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతంవికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పట్టణ విస్తరణకు సంబంధించి ఫైల్ పెండింగ్‌లో ఉంది. మంత్రి కేటీఆర్ ప్రకటనతో ఫైల్‌కు మోక్షం కలుగుతుందని భావించినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో ఫైల్ పెండింగ్‌లోనే పడింది. మున్సిపల్ పాలకవర్గం కూడా పట్టణ విస్తర్ణకు తీర్మానం చేస్తూ ఓకే చెప్పిన విషయం విదితమే. జిల్లాలోనే వ్యాపార, వాణిజ్య కేంద్రంగా కొనసాగుతుండటమే కాకుండా డివిజన్ స్థాయి యంత్రాంగం తాండూరులోనే ఉంది.

విస్తరిస్తే పెరగనున్న ఆదాయం

తాండూరు పట్టణాన్ని మరింత విస్తరిస్తే ఆదాయం పెరగనుంది. పట్టణ శివారులోని పలు సర్వేనెంబర్లు విలీనానికి ఎలాంటి ఇబ్బందులు లేకున్నా శివారు గ్రామాల పరిధిలో ఉన్న సర్వేనెంబర్ల విలీనంపైనే పీఠముడి ఉంది. పట్టణ విస్తీర్ణం జరిగితే యాలాల మండల పరిధిలోని కోకట్, రసూల్‌పూర్, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీలు మున్సిపాలిటీలో విలీనం కానున్నాయి. ఇక్కడ కోకట్ గ్రామ పరిధిలోకి పట్టణ శివారులోని సాయిపూర్ ప్రాంతానికి చెందిన పలు సర్వేనెంబర్లు కోకట్ సరిహద్దు గ్రామం కింద ఉన్నాయి. అదేవిధంగా అంతారం, అంతారం గ్రామపంచాయతీ పరిధిలోని అంతారం, పీఎన్ఆర్ నగర్, విజయ్‌నగర్ కాలనీ, ఎన్టీఆర్‌నగర్ కాలనీలున్నాయి. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని మల్‌రెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన పలు సర్వేనెంబర్లు అంతారం గ్రామ పంచాయతీకి సరిహద్దు సర్వేనెంబర్లుగా కేటాయించారు. చెనిగేష్‌పూర్ శివారులోని పలు భూములు కూడా పట్టణ ప్రాంతానికి చెందినప్పటికీ రెవెన్యూ రికార్డుల ప్రకారం చెనిగేష్‌పూర్ సరిహద్దు సర్వేనెంబర్లుగా ఉన్నాయి. అంతారం, కోకట్, చెనిగేష్‌పూర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌లు ఇబ్బడి ముబ్బడిగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిస్తున్నారు. దీంతో తాండూరు మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. ఈ ప్రాంతంలోని ఇళ్లకు సౌకర్యాలన్నీ మున్సిపాలిటీ వారు కల్పిస్తున్నప్పటికీ రెవెన్యూ భూముల వద్ద సమస్య ఏర్పడుతుంది. లక్షలాది రూపాయలను మున్సిపాలిటీ నష్టపోతుంది. క్రమానుగతంగా పట్టణం విస్తరిస్తున్నప్పటికీ శివారుప్రాంతాలపై మున్సిపాలిటీకి అజమాయిషీ లేకుండా పోయింది. దీంతో అటు పాలకులు, ఇటు అధికారులు ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. పట్టణ విస్తరణ జరిగితే తప్పా ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. పట్టణ పరిధిలో అనుమతులు పొందాలంటే సవాలక్ష నిబంధనలున్నాయి. దీంతో ఎలాంటి నిబంధనలు లేని పంచాయతీలకు వెళ్లి అనుమతులు పొందుతున్నారు. ఇక్కడ సరిహద్దు సర్వేనెంబర్లుగా పేర్కొంటూ అనుమతులు పొందేందుకు చాన్స్ ఉండటంతో కాలనీల ప్రజలంతా కోకట్, అంతారం, చెనిగేష్‌పూర్‌లో అనుమతులు పొందుతున్నారు.

భౌగోళికంగా, నైసర్గికంగా కొంత మార్పులు

పట్టణ విస్తర్ణ జరిగితే భౌళికంగం, నైసర్గికంగా, రాజకీయంగా మార్పులకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తాండూరుమున్సిపాలిటీలో 31 వార్డులున్నాయి. శివారు కాలనీలు, గ్రామాల విలీనమైతే 10 నుంచి 12 వార్డులు కొత్తగా ఏర్పడే అవకాశాలున్నాయి. ముఖ్యంగా పట్టణాలకు ఆనుకుని ఉన్న గ్రామాలను కలుపుకుని ఒక క్రమానుగత పట్టణీకరణ జరిగేందుకు అవసరమైన తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు మంత్రి కేటీఆర్ ఆదేశించిన విషయం విదితమే. ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలను డీ నోటీఫై చేసి చట్టబద్ధంగా వాటిని పురపాలక సంస్థలకు నోటీఫై చేయాల్సి ఉంటుంది. దీంతో రాజకీయంగా కాలనీల అధ్యక్షులతోపాటు కౌన్సిలర్ల స్థానాలు పెరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా సమస్యలకు ఎక్కడ చెప్పుకోవాలని కాలనీల ప్రజలకు రాజకీయ అవకాశాలు లభిస్తాయి.

శివారు కాలనీలకు మోక్షం ఎప్పుడో

దశాబ్దాల కాలంగా ఆ కాలనీలకు దశ తిరగడం లేదు. కేటీఆర్ ప్రకటనతో అయినా కాలనీలకు మహర్దశ పడుతుందనుకుంటే ఆ దిశగా కూడా చర్యలు ప్రారంభం కాకపోవడంతో తాండూరు పట్టణ శివారులోని రాజీవ్ గృహ కల్ప, ఇందిర కాలనీ, గ్రీన్‌సిటి, అయ్యప్పనగర్, ఎన్టీఆర్ నగర్ కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీ విస్తరణ చేపడితే ఈ కాలనీ ప్రజలు సమస్యలు తీరుతాయి.

మంత్రి చొరవ చూపాలి..

పెండింగ్‌లో ఉన్న పట్టణ విస్తరణపై పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న మున్సిపాలిటీ విస్తరణపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి మహేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపించాలని మున్సిపల్ పాలకవర్గం కోరుతుంది. కేటీఆర్ ప్రకటించి నెల రోజులు దాటినప్పటికీ ఇందుకు సంబంధించి పెండింగ్ ఫైల్‌కు ఎలాంటి మోక్షం లభించడం లేదు. మంత్రి చొరవ చూపితే తప్పా విస్తరణ జరిగే అవకాశాలు కనిపించడం లేదు.

నేడు మహిళాఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలి

అనంతగిరి : భారత దేశంలోనే మొదటి మహిళ ఉపాధ్యాయురాలైన సావిత్రీ భాయ్ పూలే జయంతి అయిన జనవరి 3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని ఆలిండియ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది అంజయ్య డిమాండ్ చేశారు. ఆమె పోరాటం మూలంగానే ప్రస్తుతం మహిళలు స్వేచ్ఛగా విద్యనభ్యశిస్తున్నారని చెప్పారు. అలాంటి మహనీయురాలి జయంతిని జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

'ప్రభుత్వ పాఠశాలలతోనే సమాజ అభివృద్ధి'

నవాబుపేట : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ఎక్కువ సంఖ్యలో విద్యార్దులు చేరే విధంగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో విద్యాధికారి గోపాల్, టీయూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, రాములు, మండల ప్రధాన కార్యధర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యూఇయర్ వేడుకలు

కోట్‌పల్లి: వింటేజ్ స్కూల్‌లో మంగళవారం ఘనంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని వింటేజ్ స్కూల్‌లో ప్రతి తరగతికి స్పెషల్‌గా కేకును తయారు చేయించి పాఠశాలలో న్యూఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధారూరులో ప్రారంభమైన శివదీక్షలు

ధారూరు: మండల పరిధిలోని పలు గ్రామాలలో శివరాత్రికి శివదీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక వీరభద్రేశ్వర ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున ఏడు మంది దీక్షాధారణ చేసి శివస్వాములు అయ్యారు. ఆలయంలో శివలింగానికి వీరభద్రేశ్వర, విఘ్నేశ్వర, సుబ్రమణేశ్వర, పార్వతిమాత, బసవేశ్వర విగ్రహాలకు పూజలు చేశారు. ఆలయ పూజారి చెన్నబసయ్య స్వామి స్వాములకు శివదీక్షాధారణ చేయించి శివమాలలో ధరింపజేశారు. కాగా మండలంలోని పలు గ్రామాలలో శివదీక్షలు చేపట్టారు.

కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

కోట్‌పల్లి: ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్ ముందుకు వెళ్తుందని పార్టీ మండల అధ్యక్షుడు లింగయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలోని రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కల్పించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్‌రావు, టీఆర్ఎస్ నాయకులు పెంటారెడ్డి, ప్రేమ్ కుమార్, యేసు, సోమేశ్వర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో..

నవాబుపేట : విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన మాట నెరవేర్చిన నాయకుడు ముఖ్యమంత్రి కేసిఆర్ అని జడ్పీటీసీ రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 24 గంటల విద్యుత్ సరఫరా ద్వారా రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాండురంగారెడ్డి, సర్పంచ్ జంగయ్య, మాజి సర్పంచ్‌లు వెంకటయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీసర

మంగళవారం ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎస్టీయూ(టీఎస్) ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీలను ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంజీవరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీరాములు, నాగార్జున్‌గౌడ్, సతీష్‌కుమార్, మల్లేష్, శంకర్‌నాయక్, ధనుంజయ్, రాజురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్‌పతి, జంగయ్య, నర్సింగ్‌రావు, బిక్షపతిగౌడ్ పాల్గొన్నారు. -ఘట్‌కేసర్



రబీపైనే ఆశలు

ఘట్‌కేసర్ రూరల్: రబీసీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు వరినాట్లల్లో తలమునకలయ్యారు. మండలంలోని కొండాపూర్, అవుశాపూర్, అంకుశాపూర్, మరిపల్లిగూడ, మాదారం చందుపట్లగూడ, బొక్కోనిగూడ, యంనంపేట్, వెంకటాపూర్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, ఘట్‌కేసర్, పోచారం, ఘణాపూర్, కొర్రెముల, మక్తా గ్రామాలలో రైతులు వరినాట్లు వేస్తూ బిజీగా ఉన్నారు. మండలంలో దాదాపు రెండు వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఈ యేడాది వర్షాకాలంలో వర్షాలు సంవృద్ధిగా కురవడంతో బోర్లలో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి వ్యవసాయం చేయని భూములను సైతం వినియోగంలోకి తీసుకొచ్చి వరినాట్లు వేస్తున్నారు. రబీలో ఎక్కువగా ఎంటీయూ 1010, ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోన) వరిరకాలను ఎక్కువగా సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు స్థానిక రైతు సేవా సహకార సంఘంలో పలు రకాల వరి విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. దుక్కులను దున్నడం, గట్లను చదును చేయడం లాంటి పనులలో రైతులు మునిగిపోయారు. గత ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర నష్టం జరిగినా అన్నదాతలు రబీసీజన్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. నాటు వేయడానికి వచ్చే మహిళ కూలీలకు ఒక్కొక్కరికి రూ.350, గట్లు తీయడానికి వచ్చిన కూలీలకు ఎకరకు రూ.



నాటు వేస్తున్న మహిళలు

1600, ట్రాక్టర్ దున్నినందుకు గంటకు రూ.900లు చెల్లించి పనులు త్వరగా ముగించుకుంటున్నారు. ఎకరం పొలంలో వరి నాటు వేస్తే దాదాపు రూ.15 నుంచి 20 వేల ఖర్చు వస్తుందని అన్నదాతలు అంటున్నారు. వరినాట్లు వేసే ముందు తగిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. మండలంలోని ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు కింద కాలువల మరమ్మతుల కారణంగా రబీ సీజన్‌లో వరినాట్లు వేయడం లేదు. లక్ష్మీనారాయణ చెరువు కింద దాదాపు రెండు వేల పైచిలుకు ఎకరాలలో వరి సాగు నిలిచిపోయింది.

ఇప్పుడైనా గట్టెక్కాలి



ఖరీఫ్‌లో నష్టం వచ్చింది. రబీ సీజన్‌లోనైనా గట్టెక్కాలి. రెండెకరాల్లో వరిసాగు చేస్తే రూ.40 వేల ఖర్చు వచ్చింది. అధికారులు అప్పుడప్పుడు వచ్చి వరిపైర్లను చూసి సలహాలు సూచనలు చేస్తే బాగుంటది.

-మాయ శివకుమార్, యువ రైతు, మరిపల్లిగూడ

విత్తనాలు అందుబాటులో ఉంచాం



రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వరి విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాము. రైతులను ఆదుకోవడమే తమ సహకార సంఘం లక్ష్యం. ఆధార్‌కార్డు తీసుకొస్తేనే ఎరువులు సరఫరా చేస్తున్నాం.

-గొంగళ్ల స్వామి, రైతు సహకార సంఘం చైర్మన్

సలహాలు, సూచనలు పాటించాలి



రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. నాటు వేసే ముందు వరినారు పైభాగాన్ని కత్తిరించి నాటు వేసుకుంటే పురుగుల నుంచి కాపాడుకోవచ్చు. చలి తీవ్రతకు నారు ఎదుగక అలస్యమయితే నారుపీకే వారంరోజుల ముందు మరోసారి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలను వేయాలి.

-శ్రీవాణి, మండల వ్యవసాయ అధికారి

పెట్రోల్, డీజిల్‌ను
జీఎస్టీ పరిధిలోకి తేవాలి
సీపీఎం మండల కార్యదర్శి ఏనుగు మనోరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మనోరంజన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం అనేక రకాల వస్తువులను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి ప్రజలు ఎక్కువగా ఉపయోగించే పెట్రోల్, డీజిల్ మరి చమురును మాత్రం జీఎస్టీ పరిధిలోకి తేకపోవడం ప్రజలను మోసగించడమేనని సీపీఎం మండల కార్యదర్శి ఏనుగు మనోరంజన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఘట్‌కేసర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గిన దేశంలో మాత్రం ప్రభుత్వం ధరలను పెంచుతుందే తప్ప తగ్గించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీమాస్ ఆధ్వర్యంలో జనవరి నెల మొత్తం ప్రజాపోరాటాలు నిర్వహిస్తుందన సీపీఎం కార్యకర్తలు, ప్రజలు టీమాస్‌కు సహకరిస్తూ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సబిత, అలివేలు, శోభన్ బాబు, చంద్రమోహన్, యాదగిరి, దాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక : రవికాంత్

కీసర: మండల కేంద్రం కీసరకు నేడు ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి రానున్నట్లు టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోర రవికాంత్, ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఉదయం పది గంటలకు రాంపల్లి దాయర‌లో వాటర్ ప్లాంట్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్ని కార్యక్రమాని విజయవంతం చేయాలని కోరారు.

ఘట్‌కేస్ మండలంలో..

ఘట్‌కేసర్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో 4, 5వ తేదిన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎంపీడీవో అరుణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4న కొండాపూర్, అవుశాపూర్, అంకుశాపూర్, మాదారం, ఏదులాబాద్, ఎన్ఎఫ్‌సినగర్, 5న కాచవానిసింగారం, నారపల్లి, వెంకటాపూర్, చౌదరిగూడ, కొర్రెముల, పోచారం, ఘణాపూర్ గ్రామాల్లో భూగర్భ మురుగు కాలువలు, సీసీరోడ్లు, కమ్యూనిటీహాళ్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎంపీపీ బండారి శ్రీనివాస్‌గౌడ్, జడ్పీటీసీ మంద సంజీవరెడ్డిలు రానున్నట్లు తెలిపారు.

'మంచినీటి సమస్య పరిష్కరించాలి'

కీసర: గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కారించాలని ఆహ్మద్‌గూడ గ్రామస్థులు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఆహ్మద్‌గూడ, రాంపల్లిచీర్యాల్ గ్రామాల్లోని సర్పంచ్‌లు నాను నాయక్, జ్యోతి, లావణ్యల అధ్యక్షతన గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఔటర్ రింగ్ రోడ్డు లోపలి గ్రామాల్లో మంచినీటి సమస్య ఉందంటూ ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు,మెట్రో వాటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసిన అసలు పట్టించుకోవడం లేదని ఆహ్మద్‌గూడ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు అధికారులను నిలదీశారు. రాంపల్లిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని, సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామాలలోని పలు అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయి, మహిపాల్‌రెడ్డి, రమేష్, ఎంపీటీసీలు సంగీత, వనిత, శ్రీనివాస్ గౌడ్, సత్తిరెడ్డి, బలరాం, కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



చీర్యాల్ గ్రామసభలో పాలక సభ్యులు, అధికారులు

'గాలికుంటు వ్యాధి టీకాలు
తప్పనిసరిగా వేయించాలి'

ఘట్‌కేసర్ రూరల్: పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి ఎం. పద్మిని కోరారు. మండలంలోని యంనంపేట్‌లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పశువులు మృత్యువాత పడే ప్రమాదమున్నందున సంవత్సరంలో రెండుసార్లు గాలికుంటువ్యాధి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో 550 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కాప్రా: మేడ్చల్ జిల్లా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి హెచ్‌బీ కాలనీలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ బొంతు రామ్మోహన్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, అసోసియేషన్ అధ్యక్షుడు టి.సత్యారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రామేశ్వర్‌రెడ్డి, కోశాధికారి కె.స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



మంత్రి పద్మారావుకు తీర్మాన పత్రమిస్తున్న ఎంపీటీసీ, గౌడసంఘం నాయకులు



పుష్పగుచ్చం ఇస్తున్న సర్పంచ్‌ల సంఘం ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు నాగరాజు

ఘట్‌కేసర్ రూరల్: మండలంలోని ప్రతాప్‌సింగారం గ్రామానికి చెందిన గీత పారిశ్రామిక సహకార సంఘం నాయకులు మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి పద్మారావును కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని 378 భూమిలో 700 గజాల స్థలాన్ని శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి ఇవ్వడానికి గ్రామపంచాయతీ ఏకగ్రీవం తీర్మానం చేసినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇటీవల సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు చర్చించి దేవాలయ నిర్మాణానికి స్థలం ఇవ్వడానికి తీర్మానించిన పత్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బాషగళ్ల సంజయ్‌గౌడ్, గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులు నర్సింహ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ స్వామిగౌడ్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో..

ఘట్‌కేసర్: సర్పంచ్‌ల సంఘం ఘట్‌కేసర్ మండల ఆధ్యక్షుడు బైరగారి నాగరాజు ఆధ్వర్యంలో పలువురు టీఆర్ఎస్ నాయకులు మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి పద్మారావు, స్థానిక ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొర్రెముల గ్రామానికి మరిన్ని నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరినట్లు నాగరాజు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంత గ్రామాల్లో క్రీడాకారులు అత్యధికంగా ఉన్నందున స్టేడియాన్ని మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కీసరగుట్ట ఆలయ కమిటీ సభ్యుడు తరిణి మహేంద్రచారీ, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిలకల నర్సింహ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన దమ్మాయిగూడ సర్పంచ్

కీసర: మండలంలోని మేజర్ గ్రామదమ్మాయిగూడ గ్రామ సర్పంచ్ పొండాల అనూరాధ యాదగిరిగౌడ్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసాంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కారించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల నేత యాదగిరిగౌడ్, వార్డు సభ్యులు కిరణ్ గుప్త, సాయినాథ్‌గౌడ్, హరిగౌడ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సర్పంచ్ అనూరాధ యాదగిరి గౌడ్



24 గంటల విద్యుత్తు వద్దే వద్దు..!

- 12 గంటలు ఇస్తే చాలు
- భూగర్భ జలం అడుగంటుతోంది
- నిరంతర విద్యుత్తుపై రైతుల మనోగతం

షాద్‌నగర్: వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్తును సరఫరా చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రైతులు పెదవి విరుస్తున్నారు. ఒకప్పుడు విద్యుత్తు సరఫరా కోసం ఆందోళనలు చేస్తూ ఉద్యమించిన రైతులే ఇప్పుడు విద్యుత్తు సరఫరాను తగ్గించమంటు న్నారు. నిరంతర విద్యుత్తు సరఫరాతో భూగర్భ జలం అడుగంటి బోర్లు, ఆపై పైర్లు ఎండిపోతాయని అన్నదాతలు భయపడుతున్నారు. 10 నుంచి 12 గంటల పాటు విద్యుత్తును సరఫరా చేస్తే సరిపోతుందని అభిప్రాయపడుతున్నారు. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని రైతులు వర్షాధారం, భూగర్భ జలంపైననే ఆధారపడి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్ట్‌లు లేని షాద్‌నగర్ ప్రాంత రైతులు భూగర్భ జలం కోసం విచ్చల విడిగా బోర్లు వేసి, పంటలను సాగుచేస్తున్నారు. ఒకప్పుడు వంద ఫీట్ల లోతు వేస్తే సరిపోను నీరు వచ్చే ప్రాంతంలో సైతం 600 ఫీట్లు వేసినా నీరు రాని పరిస్థితి నెలకొంది. ఒక వైపు భూగర్భ జలం కోసం విచ్చల విడిగా బోర్లు వేసి అప్పుల పాలైన రైతులు, విద్యుత్తు కోసం కూడ రోడ్డు ఎక్కి ఆందోళన చేశారు. అయితే గత వర్షా కాలంలో కురిసిన వర్షాలకు నియోజక వర్గంలోని 80శాతం చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చింది. ఎండిపోయిన బోర్లులో సైతం నీరు పైకి వచ్చింది. ప్రభుత్వం 24 గంటల విద్యుత్తును సరఫరా చేస్తామని ముందుగానే ప్రకటించడంతో పాత విద్యుత్తు పంపుసెట్లకు సైతం మరమ్మతులు చేసి, బోర్ల కింద వరినాట్లు వేస్తున్నారు. నవంబర్ నెలలో ప్రయోగాత్మకంగా 15 రోజుల పాటు 24 గంటల విద్యుత్తును సరఫరా చేశారు. దాంతో బోర్లు నిరంతరం పనిచేశాయి. విద్యుత్తు పంపుసెట్లు నిరంతరంగా పనిచేస్తే భూగర్భ జలం పూర్తిగా పడిపోయి, బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉంటుందని భయపడుతున్నారు. నిరంతర విద్యుత్తుతో పంపుసెట్లు సైతం కాలిపోయే అవకాశాలు అధికమని భావిస్తున్నారు.

12 గంటలు ఇస్తే చాలు



వ్యవసాయానికి 12 గంటలు కరెంటు ఇస్తే సరిపోతుంది. 24 గంటలు ఉంటే భూమిలోని నీళ్లు మొత్తం బయటికి తోడేస్తాయి. కొన్నాళ్లకే బోర్లు ఎండిపోతాయి. ఆ తర్వాత వేసిన పంటలూ ఎండిపోతాయి. గతంలో 9 గంటలు ఇచ్చేవారు. ఇప్పుడు 12 గంటలు ఇస్తే సరిపోతుంది.

- వెంకటయ్య, భీమారం-ఫరూఖ్‌నగర్ మండలం

బోర్లు ఎండిపోతాయి



